

పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయం

పుడా.. ఆడిట్ దడ!

వైసీపీ నేతల కనుసన్నల్లో వ్యవహారాలు

నాయకులతో అంటకాగిన పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ (పుడా) అధికారుల్లో దడ మొదలైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పుడాలో అక్రమాల లెక్కలు తేల్చేపని మొదలు పెట్టారు. పుడాలో 2005-2023 మధ్య ఆర్థిక లెక్కలపై ఆడిట్ చేపడుతున్న నేపథ్యంలో అధికారుల్లో టెన్షన్ పట్టుకుంది. రెండేళ్ల కిందట పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడంతో ఐదు రెవెన్యూ గ్రామాలకే పరిమితమైన పుడాను నియోజకవర్గంలోని ఆరు మండలాలకు విస్తరించారు. ఆర్భాటంగా పుడా పరిధి పెంచినా.. ఉద్యోగుల నియామకాలు మాత్రం చేపట్టలేదు. పుడాలో కీలకమైన ఉద్యోగుల నియామకాల్లేక ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తూ.. అధికార పార్టీకి అడ్డాగా మారిందన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఏడాదిన్నరగా రెగ్యులర్ వైస్ చైర్మన్ సీటు ఖాళీగా ఉంది. పుట్టపర్తి, ధర్మవరం మున్సిపల్ కమిషనర్లకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అప్పట్లో అధికార వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆడిందే ఆటగా మారిందన్న వాదనలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పుడాలో కుదిరితే లొంగదీసుకో.. లేకుంటే బెదిరించు.. భయపెట్టు అన్న చందంగా వైసీపీ నేతలు వ్యవహరించారు. పుడా చైర్మన్ నామమాత్రమేననీ, ఏ పని కావాలన్నా.. గత ప్రభుత్వంలో పుట్టపర్తి ఎమ్మెల్యే చెబితేనే జరుగుతుందన్నది బహిరంగ రహస్యమే. అందుకు అధికారులు కూడా తలూపేవారు. ఐదేళ్లుగా అడిగేవారేలేరన్న ధీమాతో ఇష్టారాజ్యంగా దందా సాగించారు. ప్రభుత్వం మారడంతో పుడా అధికారుల్లో దడ మొదలైంది.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

యథేచ్ఛగా అక్రమాలు	ఇన్‌చార్జిల పాలనతోనే నెట్టుకొచ్చిన వైనం	ఆడిటింగ్‌లో అక్రమాల నిగ్గుతేలేనా?	మున్సిపాలిటీకి ఇచ్చిన రూ.కోటికి లెక్కలేవీ?



ఇన్‌చార్జిలే దిక్కు

పుడాలో ప్రభుత్వం వైస్‌చైర్మన్‌తోపాటు 14 మంది ఉద్యోగులను కేటాయించారు. శిల్పారామం సమీపంలోనే ఓ విల్లాలో అద్దె భవనంలో పుడా కార్యాయలం కొనసాగిస్తున్నారు. పుడా పరిధిలోని ఆరు మండలాలు, 1417 చదరపు కిలోమీటర్ల పరిధిలో పుడా ఏర్పాటు చేశారు. 15 మంది ఉద్యోగులను నియమించాల్సి ఉంది. 2022 మార్చిలో వైస్‌చైర్మన్ సెలవుపై వెళ్లడంతో కొన్నాళ్లు పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ బదిలీ అవడంత సమస్య మొదటికొచ్చింది. ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఎన్నికల ముందు డిప్యూటీ డైరెక్టరే.. వైస్ చైర్మన్‌గా వ్యవహరించాల్సి వచ్చింది. జిల్లా కేంద్రం ఏర్పడి రెండేళ్లు గడిచిపోగా.. అందులో ఏడాదిన్నర ఇన్‌చార్జి వైస్ చైర్మన్‌తోనే నెట్టుకొచ్చారు. పుడాలో వైస్‌చైర్మన్ స్థానంతోపాటు 15 మంది ఉద్యోగుల్లో కేవలం డీడీ, టీపీఏ, సచివాలయ టౌన్‌ప్లానింగ్ కార్యదర్శిని మాత్రమే డిప్యుటేషన్‌పై నియమించారు. కార్యాయలంలో ఐదుగురు కాంట్రాక్టు ఉద్యోగులు, ఇద్దరు దినసరి వేతనంతో పనిచేస్తున్నారు. కీలకమైన వైస్‌చైర్మన్‌తోపాటు ప్రదాన విభాగాల్లో పోస్టులు భర్తీ చేయకపోవడంతో పుడా అలంకారప్రాయంగా మారిపోయి, ఏడాదిన్నరగా వైసీపీ అడ్డాగా మారిందన్న విమర్శలకు దారితీసింది. పుడా విస్తరణతో ఆ పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది.

పుడా అధికారుల్లో అక్రమాల దడ

పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడంతో పుడా పరిధిలో అనధికార లేఅవుట్లు, నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల కట్టడాలు భారీగానే వెలిశాయి. పుడా పరిధిలోని పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎయిర్‌పోర్టు, ఎనుమలపల్లి, బ్రాహ్మణపల్లి, కర్ణాటకనాగేపల్లి, మామిళ్లకుంట, బీడుపల్లితోపాటు బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, ఆమడగూరు, ఓబుళదేవరచెరువులో అనధికార లేఅవుట్లు, అనుమతిలేని బహుళ అంతస్తుల నిర్మాణాలు యథేచ్ఛగా చేపట్టారు. ఇందులో నిబంధనలను అతిక్రమించి వెంచర్లు వేస్తూ కాలువలను పూడ్చి ప్లాట్లు వేశారు. ప్రభుత్వ అసైన్డ్ భూములను కూడా కలిపేసుకుని రియల్ వెంచర్లు వేశారు. కొంతమేర లేఅవుట్లకు అనుమతులు తీసుకుని, అనధికారికంగా అధిక విస్తీర్ణంలో ప్లాట్లు వేస్తున్నా.. చర్యలు తీసుకునేందుకు పుడా అధికారులు వెనుకంజ వేశారు. కీలక విభాగాల్లో ఉద్యోగుల కొరతతోపాటు వైసీపీ నేతల కనుసన్నల్లో అనధికారికంగా అనుమతులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసి ఐదేళ్లలో ముక్కుపిండి రూ.కోట్లు దోశారు. ఓ బహుళ అంతస్తుల నిర్మాణానికి అనుమతులు ఇవ్వకుండా బిల్డర్‌తో ఏకంగా రూ.50 లక్షల దాకా ఓ వైసీపీ నేత వసూలు చేసినట్లు, ఈ వ్యవహారంలో పుడాలోని ఓ అధికారి కీలకంగా వ్యవహరించినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. జిల్లా కేంద్రం ఏర్పడ్డాక పుడా పరిధిలో లేఅవుట్ వేయాలన్నా.. భవననిర్మాణాలు చేపట్టాలన్నా.. అనుమతుల ఇప్పించాలన్నా.. అప్పటి వైసీపీ నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు, అనుచర నేతలు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాల్సిందేనన్న విమర్శలున్నాయి. పట్టణాభివృద్ధికి మాస్టర్ ప్లాన్, జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్లు రూపొందించడం, మెరుగు పరచడం, నియంత్రించడం, అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలపై చర్యలు తీసుకునే అధికారం పుడాకి ఉంది. అనుమతులు జారీచేసి, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పిచడం, లేఅవుట్లు, భవన నిర్మాణాలకు ప్లాన్ల మంజూరు తదితర బాధ్యతలు పుడావే. పుడా కార్యాలయంలో ఏ చిన్న పని కావాలన్నా.. అప్పట్లో వైసీపీ నాయకులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాల్సిందే. వారికి తెలియకుండా ఏ పనీ చేయలేని దుస్థితి ఉండేది. పనిలో పనిగా కొందరు సిబ్బంది తామేమీ తక్కువ కాదంటూ బాగానే వెనకేసుకున్నట్లు విమర్శలున్నాయి. అడ్డంగా దోచేందుకే పక్కా ప్లానింగ్‌తో పుడా కీలకమైన శాఖల్లో ఉద్యోగుల నియామకం చేపట్టకుండా వైసీపీ నేతలే అడ్డుపడ్డారన్న విమర్శలు లేకపోలేదు. పుడాలో నిధులు, పనులన్నీ పంచి నాలుగు రాళ్లు వెనకేసుకునేలా అక్రమాలకు తెరలేపారు. ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోవడంతో పుడా అధికారుల్లో వణుకు మొదలైంది. పుట్టపర్తి మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం రెండుసార్లు రూ.కోటిదాకా నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో ఎక్కడ, ఏ పనులు చేశారో అడిగేనాధుడే లేరన్న చర్చ సాగుతోంది. పుడాకు ఇన్‌చార్జిగా పనిచేసిన వారితో పాటు వైసీపీతో అంటకాగిన అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఎన్నికలు ముగిశాక పుడాపై ఆడిటింగ్ విభాగం రంగంలోకి దిగింది. ప్రభుత్వం మారిన తరువాత చేపడుతున్న ఆడిట్‌లో పుడా అక్రమాల నిగ్గు తేల్చుతారా, మూసేస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



పుడాలో ఆడిటింగ్ చేస్తున్న అధికారులు (ఫైల్)

మదనపల్లి ఘటనతో అధికారులు అలర్ట్

- రికార్డు రూమ్‌ల పరిశీలనకు శ్రీకారం
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జేసీ, సబ్ కలెక్టర్ ఆదేశాలు

మడకశిర టౌన్, జూలై 24: మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల దహనం నేపథ్యంలో జిల్లా అధికారులు అలర్ట్ అయ్యారు. జాయింట్ కలెక్టర్ (జేసీ) అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్.. కార్యాలయాల్లో రికార్డు రూమ్‌ల తనిఖీకి బుధవారం శ్రీకారం చుట్టారు. కదిరి నియోజకవర్గంలోని తహసీల్దార్ కార్యాలయాలను జేసీ తనిఖీ చేశారు. రికార్డు రూమ్‌లలో భద్రతా చర్యలపై ఆరాతీశారు. రికార్డులను పకడ్బందీగా భద్రపరచాలనీ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆయా తహసీల్దార్లను ఆదేశించారు. పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ మడకశిర, అమరాపురం, రొద్దం తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డులను భద్రపరచిన గదులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నల్లచెరువు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు రూమ్‌ను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ కుమార్


మభ్యపెట్టి.. మాట తప్పి..!

హామీలకే పరిమితమైన జలకళ
ప్రభుత్వమే సర్వం భరిస్తుందంటూ ప్రగల్భాలు

మడకశిర రూరల్, జూలై 24: గత వైసీపీ ప్రభుత్వం.. జలకళ పథకాన్ని ఆర్భాటంగా ప్రవేశపెట్టింది. చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా బోరు వేయించి, మోటారు, స్టార్టర్ సర్వం ఇస్తామని అప్పటి పాలకులు వాగ్దానాలు కురిపించారు. కరువుతో విలవిల్లాడుతున్న జిల్లా రైతులు సంబరపడ్డారు. బోరుబావుల కిందయినా పంటలు సాగుచేసుకుని, అప్పుల ఊబి నుంచి బయటపడదామని భావించారు. ఆచరణలోకి వచ్చేసరికి జలకళ పథకాన్ని తుస్సుమనిపించారు. వందల్లో దరఖాస్తు చేసుకుంటే.. పదుల మందికి కూడా వర్తింపజేయలేదు. జలకళ పథకం కింద బోర్లు వేసిన వారికి బిల్లులు కూడా చెల్లించలేదు. దీంతో వారు బోరు వేయడానికి ముందుకురాలేదు. విద్యుత్ కనెక్షన్ రైతులే తీసుకోవాలన్నారు. విద్యుత్ కనెక్షన్ ఉంటేనే బోరు వేసి, మోటారు, స్టార్టర్ ఇస్తామని కండీషన్ పెట్టారు. దీంతో చాలామంది రైతులు పథకానికి దూరమయ్యారు. కొంతమంది అన్ని అర్హతలూ ఉన్నవారు విద్యుత్ కనెక్షన్ సైతం తీసుకున్నా.. మోటారు, స్టార్టర్ ఇవ్వలేదు. వైసీపీ నాయకులు, కార్యకర్తలకే అందజేసి, చేతులు దులుపుకున్నారన్నది బహిరంగ రహస్యం. దీంతో గత వైసీపీ పాలకుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

రైతు ఆశలపై గత వైసీపీ ప్రభుత్వం నీళ్లు





బోరు వేశాక.. నిబంధన తెచ్చారు..

జలకళ పథకం కింద నా పొలంలో బోరు వేశారు. ఎంతో సంతోషించా. ఆ తరువాత విద్యుత్ కనెక్షన్ రైతులు సొంత ఖర్చులతో తీసుకోవాలన్న నిబంధన తెచ్చారు. దీంతో బోరు వేసి రెండేళ్లయినా నిరుపయోగంగా పడి ఉంది.

- శంకర్ నాయక్, రైతు, చందకచర్ల

తర్వాత మాట తప్పారు..

జలకళ పథకం రైతులకు కన్నీరే మిగిల్చింది. 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం పథకాన్ని ప్రవేశపెట్టింది. సన్న, చిన్నకారు రైతులకు బోర్లు వేయించి, మోటార్లు, స్టార్టర్లు, విద్యుత్ కనెక్షన్ ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. రైతులు అప్పట్లో సంతోషం వ్యక్తంచేశారు. బోర్లు వేసి ఇస్తే పంటలు పండించుకుందామని ఆశపడ్డారు. ఆచరణలోకి వచ్చేసరికి రైతుల సంతోషం ఆవిరైపోయింది. సొంత ఖర్చులతో విద్యుత్ కనెక్షన్ తీకున్న రైతులకే జలకళ బోర్లు వేయిస్తామని అప్పటి ప్రభుత్వం నిబంధన విధించింది. దీంతో రైతులు నిరాశచెందారు. మడకశిర నియోజకవ్గంలోని ఐదు మండలాల్లో జలకళ పథకం కింద 152 మంది రైతులను ఎంపిక చేశారు. వారికి ఉచితంగా బోరు వేసి, మోటార్లు, స్టార్లర్లు అందించనున్నట్లు తెలిపారు. చాలామంది బోర్లు వేయించకోవడానికి ముందుకొచ్చారు. ఆ తరువాత వైసీపీ పాలకులు మాట మార్చారు. ఉచితంగా బోరు వేస్తామనీ, విద్యుత్ కనెక్షన్ రైతులే సొంత ఖర్చులతో తీసుకోవాలని నిబంధన విధించారు. దీంతో రైతుల ఆశలు ఆవిరైపోయాయి. మూడేళ్లలో నియోజకవర్గంలోని

విద్యుత్ కనెక్షన్ రైతులే తీసుకోవాలంటూ మాట మార్పు
అయినా.. అర్హులకు అందని ప్రయోజనం

ఐదు మండలాల్లో 150 రైతులకుగాను 40 మందికి మాత్రమే బోర్లు వేశారు. వారిలోనూ 11 మంది మాత్రమే సొంత ఖర్చులతో విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నారు. కొంత మంది రైతులు విద్యుత్ కనెక్షన్ తీసుకున్నా.. మోటార్లు, స్టార్టర్లు ఇవ్వలేదు. దీంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

11 మందికి మోటార్లు, స్టార్టర్లు అందించాం

జలకళ పథకం కింద బోర్లు వేయించుకున్న రైతులు సొంత ఖర్చులతో విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని అప్పట్లో ప్రభుత్వం నిబంధనలు విధించింది. మూడేళ్లలో 44 మంది రైతులు ఈ పథకం కింద బోర్లు వేయించుకున్నారు. 11 మంది మాత్రమే సొంత ఖర్చులతో విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారు. వారికి మాత్రం మోటార్లు, స్టార్టర్లు ఇచ్చాం.

- లక్ష్మీనారాయణ, ఉపాధి హామీ ఏపీడీ, మడకశిర



వైసీపీ నాయకులకే బోర్లు, మోటార్లు..

జలకళ పథకం కింద నా పొలంలో బోరు వేశారు. విద్యుత్ కనెక్షన్ కూడా తీసుకున్నా. మూడేళ్లయినా మోటారు, స్టార్టర్ ఇవ్వలేదు. బోరుబావి నిరుపయోగంగా మారింది. వైసీపీ నాయకులకు మాత్రం బోరు వేసిన వెంటనే మోటారు, స్టార్టర్ అందించారు. అసలైన రైతుకు మాత్రం మొండిచేయి చూపారు. కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయా.

- చెన్నప్ప, రైతు, చందకచర్ల

ఫ్యాన్ ఫాలోయింగ్..!

వైసీపీ వీరభక్తుల పోస్టింగ్ వేట



- గత ప్రభుత్వంలో హద్దు దాటి వ్యవహారాలు
- పాలకపక్షం సేవలో తరించిన వైనం
- బరితెగించి అక్రమాలు
- కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పోస్టింగ్ కోసం తిప్పలు
- ముమ్మరంగా పైరవీలు

హిందూపురం, జూలై 24: ప్రభుత్వ ఉద్యోగులు నిష్పాక్షికంగా, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాల్సి ఉంటుంది. ఆ విషయాన్నే కొందరు ఉద్యోగులు మరిచారు. గత ప్రభుత్వంలో వైసీపీతో అంటకాగారు. కొందరైతే ప్రభుత్వ ఉద్యోగులమన్న సంగతే మరిచి ఐదేళ్లు వైసీపీ నేతల అడుగులకు మడుగులొత్తారు. సాధారణ ప్రజలను సైతం ఇబ్బంది పెట్టారు. వారిని ప్రజలే ఛీకొట్టారు. వైసీపీ నేతల అవినీతికి వంతపాడిన అధికారులు రూ.కోట్లు గడించారు. అలాంటి వారే ప్రస్తుతం మళ్లీ అదేస్థానంలోకి రావాలని పైరవీలు సాగిస్తుండటం గమనార్హం. బదిలీల పర్వం మొదలుకాకనే నేతల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి, పెద్దఎత్తున అధికారుల బదిలీలు చేపట్టింది. అప్పట్లో విధుల్లో ఉన్న కొన్ని ముఖ్యశాఖల అధికారులు వైసీపీ కండువా వేసుకోకుండానే ఆ పార్టీకి క్రియాశీలక కార్యకర్తల్లా వ్యవహరించారన్న ఆరోపణలు మూటగట్టుకున్నారు. అలాంటి అధికారులను ఎన్నికల ముందు వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరినా.. పాతస్థానానికి బదిలీ చేయించుకునేందుకు పైరవీలు మొదలెట్టారు. ప్రస్తుత అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుంటున్నారు. పోలీసు, మునిసిపల్, ఎక్సైజ్, ఎంపీడీఓలు, సబ్‌రిజిస్ట్రార్లు ఈ కోవలో ఉన్నారు.

బదిలీ తప్పించుకునేందుకు పైరవీలు

కొంతమంది అధికారులు బదిలీ చేస్తారన్న అనుమానంతో గతంలో వైసీపీకి వీరవిధేయులుగా పనిచేసిన అధికారులు సైతం ఒక్క అవకాశం ఇప్పించాలని టీడీపీ నాయకుల వెంట పడుతున్నారు. హిందూపురం నియోజకవర్గంలో ఓ మండల అభివృద్ధి అధికారి ఇక్కడి నుంచి ఎన్నికలకు ముందు పక్క జిల్లాకు వెళ్లారు. ఆ అధికారి ప్రస్తుతం ఇక్కడికి రావడానికి నానా అవస్థలు పడుతున్నాడు. తెలుగుదేశం పార్టీలోని తన సామాజికవర్గానికి చెందిన నాయకులతో కొన్నిరోజులుగా టచ్‌లోకి వచ్చి ఒత్తిళ్లు చేస్తున్నారు. ఈ అధికారి ఎన్నికలకు కొన్నిరోజుల ముందు ఎట్టి పరిస్థితుల్లోనూ తెలుగుదేశం పార్టీ గెలవదనీ, జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గాలికి కొట్టుకుపోతుందని శపథాలు చేశారు. ఏకంగా టీడీపీ నాయకులతోనే బహిరంగంగా అన్నారు. అంతటి వీరభక్తుడు ప్రస్తుతం పాలకపక్షం మారినా.. పాత స్థానానికి రావాలని తాపత్రయం చెందుతున్నాడు. కొంత మంది ఆయనకు మద్దతిస్తున్నట్లు సమాచారం. వైసీపీ పాలనలో రెండేళ్లపాటు ఇక్కడ పనిచేసి వెళ్లిన ఓ పోలీసు అధికారి ఇక్కడికి రావాలని ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇప్పటికే ఇక్కడున్న స్థానాలు భర్తీ అయ్యాయనీ, ఇక పోస్టింగులే తరువాయి అని చెబుతున్నా ఆయన మాత్రం ప్రయత్నాలు ఆపట్లేదు. లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో పనిచేసిన ఓ రెవెన్యూ అధికారి ప్రస్తుతం వైసీపీకి చెందిన మండలస్థాయి ప్రజాప్రతినిధి, మాజీ ప్రజాప్రతినిధికి అసైన్డ్ భూములను అప్పనంగా కట్టబెట్టినట్లు ఆరోపణలున్నాయి. అయినా ఆయన ప్రస్తుతం ఇక్కడికి రావడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడు. మరో రెవెన్యూ అధికారి మరో మండలంలో పనిచేసి వైసీపీ కార్యకర్తలా వ్యవహరించాడు. ఆ మండలంలో జగనన్న లేఅవుట్‌లో పట్టాల పంపిణీలో అనర్హులకు పెద్దపీటట వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయినా కూటమిలోని ఓ పార్టీ నాయకుడి ద్వారా ఇక్కడికి రావడానికి తీవ్ర కృషి చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం మున్సిపాలిటీలో కీలకంగా వ్యవహరించిన అధికారి భారీ అవినీతికి పాల్పడి ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లాడు. ఆయన కూడా ఇక్కడికి రావడానికి పావులు కదుపుతున్నాడు. ఇలా చెప్పుకుంటూపోతే నియోజకవర్గంలో చాలామంది ఉన్నారు. వీరితోపాటు ప్రస్తుతం కొన్ని శాఖల్లో పనిచేస్తున్న అధికారులు బదిలీ నుంచి తప్పించుకుని, ఇక్కడే ఉండేందుకు పైరవీలు చేస్తున్నారు.

పోలీసు శాఖను ప్రక్షాళన చేస్తేనే..

కొందరు పోలీసు అధికారులతోపాటు సిబ్బంది సైతం వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు చెప్పినదానికి తలూపారు. ఎంతగా అంటే వైసీపీ నాయకులకు పదవులు లేకపోయినా వారికి ప్రొటోకాల్ ఇచ్చారు. సిబ్బంది కూడా ప్రస్తుతం ఇక్కడే ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. వైసీపీ పాలనలో ఇద్దరు, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు క్రియాశీలకంగా వ్యవహరించారు. వారి వ్యవహారం ఆ శాఖకు మచ్చను తెచ్చిపెట్టింది. టీడీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడంతోపాటు నానా ఇబ్బందులు పెట్టారు. హిందూపురంలో కొంతమంది కానిస్టేబుళ్లు ఎన్నికల ముందు వైసీపీ నాయకుల వెంట వెళ్లి ప్రచారం చేశారు. కొంతమంది టీడీపీ నాయకులను ఇబ్బందులు పెట్టి, వైసీపీలోకి రావాలని తీవ్ర ఒత్తిడి చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ శాఖలో పూర్తి ప్రక్షాళన చేస్తేతప్ప.. తీరుమారదు. ఆ దిశగా ఉన్నతాధికారులు, పాలకులు ప్రయత్నించాలి. ఈ సందర్భంలో కొన్ని అక్రమాలకు మరికొంత మంది అక్రమార్కులకు అడ్డుకట్ట వేయవచ్చు. లేదంటే వారు అదేస్థానంలో ఉంటే టీడీపీ కంటే వైసీపీ నాయకుల మాటే చలామణి అవుతుంది. చిలమత్తూరు మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా ఓ పోలీసు అధికారి అత్యుత్సాహం ప్రదర్శించి, వైసీపీ ప్రజాప్రతినిధికి భారీ బందోబస్తు ఏర్పాటు చేయడమే ఇందుకు నిదర్శనం. తహసీల్దార్ కార్యాలయం వద్ద వందలాది మంది టీడీపీ కార్యకర్తలున్నా వైసీపీ ప్రజాప్రతినిధికి కాపలా కాయడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది.

ఫుల్లు మత్తు..!



పాముతో చెలగాటం ఆడుతున్న నాగరాజు



మద్యం మత్తులో పాముతో చెలగాటం

కదిరి, జూలై 24: అతడు మద్యం మత్తులో ఉన్నాడు. ఎంతలా అంటే.. తాను ఏం చేస్తున్నానో కూడా తెలుసుకోలేనంతలా. అలాంటి అతడికి కదిరి డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం ఓ నాగుపాము కనిపించింది. అంతే.. దాంతో చెలగాటం ఆడడం మొదలెట్టాడు. నాగుపాము పడగను చేతితో ముదుతూ.. కొడుతూ.. తోకను పట్టుకుంటూ చిత్రవిచిత్రంగా వ్యవహరించాడు. దానిని చూస్తున్న వారంతా భయాందోళనకు లోనయ్యారు. వదిలెయ్యమని వారిస్తున్నా.. అతడు వినలేదు. ఇంతలోనే నాగుపాము కాటేసింది. అయినా.. అతడు లెక్కచేయలేదు. అలానే పాముతో చెలగాటం ఆడసాగాడు. పామును పట్టుకుని, సమీపంలోని రహదారిపైకి వెళ్లాడు. అక్కడ కూడా ఆడుకోసాగాడు. రహదారిపై వెళ్లేవారు గట్టిగా వారించడంతో పామును పొదల్లోకి వదిలేశాడు. అతడి పేరు నాగరాజు. పట్టణంలోని సైదాపురం ఎస్సీ కాలనీ వాసి. పాములు పట్టుకోవడం అతడికి అలవాటు అని తెలిసింది. రెండు నెలల క్రితం కూడా పాము కాటేయడంతో నాగరాజు అస్వస్థతకు లోనైనట్లు తెలిసింది. బుధవారం నాగుపాము కాటేసినా.. అతడు ఆస్పత్రికి వెళ్లకుండా బంధువుల ఊరెళ్లినట్లు సమాచారం. పాములు పట్టుకోవడంలో ఎంతటి నైపుణ్యం ఉన్నవారైనా అది కాటేయకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తారు. నైపుణ్యంతో పట్టుకుంటారు. ఒకవేళ కాటేస్తే.. వెంటనే ఆస్పత్రికెళ్లి వైద్యం చేయించుకుంటారు. నాగరాజు మాత్రం మద్యం మత్తులో నిర్లక్ష్యంగా పాముతో చెలగాటం ఆడడాన్ని చూసిన వారంతా విస్మయం వ్యక్తం చేశారు. ప్రాణాలతో చెలగాటం ఆడడమేనంటూ చర్చించుకున్నారు.

వసూళ్ల కింగ్!

జూన్ వస్తే ఆయనకు పండగే

- స్కూళ్లకు ఏడాదికి టార్గెట్లు ఫిక్స్
- రీ ఓపెన్ కాగానే ముట్టజెప్పాల్సిందే
- కోట్లకు పడగలెత్తిన అధికారి
- పదేళ్లుగా జిల్లా కేంద్రంలోనే తిష్ట
- జిల్లా విద్యాశాఖలో అవినీతి జలగ



అనంతపురం విద్య, జూలై 24: పదేళ్లకు పైగా ఒకే పోస్టులో ఉన్న ఓ అక్రమార్కుడు వసూళ్లలో కింగ్‌లా అవతరించాడు. పెట్టుబడి లేని దందాతో కోట్లకు పడగలెత్తాడు. కొందరు మున్సిపల్ టీచర్లను ప్రైవేట్ సైన్యంలా ఏర్పాటు చేసుకుని వసూళ్లకు పాల్పడుతున్నాడు. విద్యా సంవత్సరం ఆరంభం అయిందంటే ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ల కంటే ఈయనకే ఎక్కువ ఆనందం. అప్పనంగా లక్షల రూపాయలు జేబులో చేరుతుండటమే ఇందుకు కారణం. ప్రతి ఏటా జూన్ మాసం వచ్చిందంటే ఆయనకు వసూళ్ల పండుగే. టార్గెట్లు పెట్టి మరీ వసూళ్లకు పాల్పడుతుంటాడు. అయితే ఆయనపై ఇప్పటి వరకూ ఏసీబీ అధికారులు కానీ, ఇటు విద్యాశాఖ అధికారులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఏటా ముట్టజెప్పాల్సిందే..

ఆయన.. మండల విద్యాశాఖలో పనిచేసే అధికారుల్లో ఒకరు. జిల్లా కేంద్రమైన అనంతపురంలో సుమారు 10 ఏళ్లకు పైగా పనిచేస్తున్నారు. ప్రతి ఏటా జూన్ 12 తర్వాత స్కూళ్లలో అడ్మిషన్లు మొదలవగానే ఆయన దందా ప్రారంభిస్తాడు. అనంతపురంలో ఉండే ప్రైమరీ, ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లే లక్ష్యంగా వసూళ్లు చేస్తారు. అడ్మిషన్ల కాలం రాగానే...ప్రతి స్కూల్ రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకూ ఆయనకు ముట్టజెప్పాల్సిందే. చాలా స్కూళ్లలో భవనాలు, ఆటస్థలాలు, మరుగుదొడ్లు, అదనపు సెక్షన్లు, టెక్స్ట్ బుక్స్, యూనిఫాం అమ్మకాలు, ఇలా ఏదో ఒక అంశంలో లోపాలుంటాయి. ఆ లోపాలే ఆయనకు కాసులు కురిపిస్తాయి. జూన్ నెలలో అడ్మిషన్లు ప్రారంభం కాగానే...ఆయనే నేరుగా స్కూళ్లలో వాలిపోతాడు. ఆ అధికారి రాగానే స్కూల్ కరస్పాండెంట్లు కిమ్మనకుండా ఆయనకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేలు చేతిలో పెట్టాలి. కొత్త స్కూళ్లు, లేదా కార్పొరేట్ స్కూళ్లు అయితే మరింత ఎక్కువ చదివించుకోవాలి. ఇది ప్రతి ఏటా నడిచే వసూళ్ల దందానట. ఈ లెక్కన ఈ ఆయన ప్రతి ఏటా లక్షలాది రూపాయలు వసూళ్లు చేసి రూ.కోట్లు వెనకేసుకొస్తున్నట్టు విమర్శలు భారీగా వినిపిస్తున్నాయి.

కోట్లకు పడగలెత్తి...

జిల్లా కేంద్రంలో విద్యాశాఖాధికారిగా పాతుకుపోయిన ఆయన ఈ పదేళ్లలో కోట్లకు పడగలెత్తాడు. గతంలో ఈ అధికారి ఓ లాడ్జిలో పేకాట ఆడుతూ పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. ఒకప్పుడు వ్యసనాలతో అప్పుల్లో కూరుకుపోయిన ఆయన వసూళ్ల దందాతో నేడు కరోడ్‌పతిగా ఎదిగాడు. ప్రతి ఏటా వచ్చే వసూళ్లతో నగరంలో సుమారు రూ. 70 లక్షల నుంచి కోటి రూపాయల విలువైన ఇల్లు కూడా నిర్మించారట. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో కరస్పాండెంట్ల నుంచే కాకుండా మున్సిపల్ స్కూళ్లలో బాగానే కథ నడుపుతున్నారు. టీచర్ల సర్దుబాటు, మిడ్ డే మీల్స్‌లో ఏజెన్సీ నిర్వాహకుల నుంచి కూడా బాగానే లాగేస్తున్నారు. ఈ వ్యవహారాల్లో కొందరు మున్సిపల్ స్కూళ్ల టీచర్లను సైతం తన సైన్యంగా మార్చుకున్నారు. మొత్తంగా కోట్లకు పడగలెత్తిన ఆ అధికారిపై గతంలో జిల్లాకు వచ్చిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కూడా ఘాటుగానే హెచ్చరించారు. అయితే వైసీపీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో చెప్పించుకుని బయటపడినట్టు సమాచారం. ఇప్పుడు మళ్లీ టీడీపీ నేతలను కాక పట్టే పనిలో పడ్డాడు. ఏ ఎండకు ఆ గొడుగు పడుతూ...కోట్లకు పడగలెత్తిన ఆ అధికారి అక్రమాలకు అంతేలేకుండా పోతోంది. జిల్లా కేంద్రంలో వసూళ్ల దందాకు పాల్పడుతున్న ఈయన ఇక్కడే ఉండే ఏసీబీ అధికారుల దృష్టికి కనిపించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

కాలాన్ని మేల్కొలిపిన కవి జాషువా

వర్ధంతి సభలో మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్



సాహితీ సదస్సులో మాట్లాడుతున్న శైలజానాథ్

అనంతపురం కల్చరల్, జూలై 24: కాలాన్ని మేల్కొల్పిన కవి గుర్రం జాషువా అని, ఆయన రచనలతో సమాజంలో చైతన్యం తీసుకొచ్చారని మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. గుర్రం జాషువా 53వ వర్ధంతి సందర్భంగా బుధవారం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల కామర్స్ సెమినార్ హాల్‌లో ఎస్కేయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన సాహితీ సదస్సుకు శైలజానాథ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సాహిత్యం నేటి యువతరానికి ఎంతో అవసరమని, జాషువా సాహిత్యం విశ్వజనీనమైనదని పేర్కొన్నారు. జాషువా సాహిత్యం పండితులకు, పామరులకు సరళంగా అర్థమయ్యేలా ఉంటుందని కొనియాడారు. జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య మాట్లాడుతూ జాషువా సాహిత్యాన్ని విద్యార్థి లోకానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. జనప్రియకవి ఏలూరు యంగన్న మాట్లాడుతూ వర్ణ సమాజం, వర్గ సమాజం పోవాలని సాహిత్యాన్ని సృష్టించిన మహాకవి జాషువా అన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ గబ్బిలం, కాందిశీకుడు, బాపూజీ, నేతాజీ, ముంతాజ్ మహల్, ఫిరదౌసి వంటి కావ్యాలతో జాషువా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, ఎల్‌కేపీ అధ్యక్షుడు గాజుల వెంకటసుబ్బయ్య, ఎస్కేయూ తెలుగుశాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నాసీల నాగేంద్ర, అంకె రామలింగయ్య, పూజారి ఈరన్న, గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి, ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తొణికిసలాడుతున్న టీబీ డ్యాం

● 99 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ ● పది గేట్లు ఎత్తి నీటి విడుదల



క్రస్ట్ గేట్ల నుంచి విడుదల అవుతున్న వరద జలాలు

బొమ్మనహాళ్, జూలై 24: తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతుండటంతో టీబీ బోర్డు అధికారులు బుధవారం 10 క్రస్ట్ గేట్లు ఒక్క అడుగు మేర ఎత్తి 18,746 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. వాటితో పాటు కాలువలకు 7205 క్యూసెక్కులను వదులుతున్నారు. 1633 అడుగులతో 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో బుధవారం సాయంత్రానికి 1631.34 అడుగులతో 99.195 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 84, 115 క్యూసెక్కులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. డ్యాంకు ఆశించిన స్థాయి కన్నా ఎక్కువగా నీరు చేరుతోంది. గరిష్ఠ స్థాయిలో నీటి నిల్వ ఉండటంతో హెచ్చెల్సీ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హెచ్చెల్సీ బొమ్మనహాళ్ సరిహద్దు 105వ కి.మీ. వద్ద 500 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 24: ప్రభుత్వ వైద్యకళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న పారామెడికల్ కోర్సులకు ఆగస్టు 6లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు తెలిపారు. డీఎంఎల్‌డీ 10సీట్లు, డీఓఏ 10, డీఏఎన్ఎస్ 30, డీఎంఐటీ 10, డీఈసీజి 3, డీఆర్‌జీఏ 3, డీడీఆర్ఏ 3 మొత్తం 69సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్‌లో బైపీసీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు.

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, జూలై 24: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.53తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం 1350టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.30, కనిష్ఠ ధర రూ.15 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, జూలై 24: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17,500, కనిష్ఠంగా రూ.2,500, సరాసరి రూ.12వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1185టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంపై వేటు

- కణేకల్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సస్పెన్షన్
- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్‌జేడీ శామ్యూల్
- వరుస కథనాలు ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి'



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏడీ నాగరాజు



ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఆర్‌జేడీ ఇచ్చిన ఉత్తర్వుల కాపీ

అనంతపురం విద్య, జూలై 24: విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తూ, స్కూల్‌కు రాకుండా అజ్ఞాతంలో ఉన్న కణేకల్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ఆదినారాయణప్పను అధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు కడప పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ శామ్యూల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మోడల్ స్కూల్‌లో ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా, సివిక్స్ పీజీటీగా పనిచేస్తున్న బీసీ ఆదినారాయణప్ప కొంతకాలంగా స్కూల్‌కు రావడం లేదు. స్కూల్‌లో సాగుతున్న తంతుపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నెల 11న 'పెద్దసారు యాడున్నాడో..? అడ్రెస్ లేని ప్రిన్సిపాల్, ఈనెల 24న 'పట్టించుకునేదెవరు..?' శీర్షికన కథనాలు ప్రచురితం అయ్యాయి. అయినా జిల్లా విద్యాశాఖాధికారుల్లో చలనం కనిపించలేదు. అయితే ఈ ఘటనపై ఆర్‌జేడీ శామ్యూల్ జిల్లా విద్యాశాఖాధికారులపై మండిపడ్డారు. వెంటనే ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. స్కూల్‌లో బోటనీ పీజీటీగా పనిచేస్తున్న బసవరాజుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఎట్టకేలకు స్కూల్‌కు వెళ్లిన ఏడీ

కణేకల్లు: జిల్లా విద్యాశాఖలో మోడల్ స్కూళ్లను పర్యవేక్షించే ఏడీ నాగరాజు ఇన్నాళ్లు అటు వైపు చూడలేదు. ఎట్టకేలకు బుధవారం ఆయన కణేకల్లు స్కూల్‌కు పరుగులు తీశారు. సుమారు రెండు నెలలుగా ప్రిన్సిపాల్ స్కూల్ విధులకు గైర్హాజరు అవుతున్నా మోడల్ స్కూల్ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంపై అనేక అనుమానాలు వస్తున్నాయి. 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు రావడంతోపాటు, ఆర్‌జేడీ ఆగ్రహంతో ఏడీలో చలనం వచ్చినట్టు ఉంది. ఎట్టకేలకు మధ్యాహ్నం మోడల్ స్కూల్‌కు వెళ్లి ఆయన విచారణ చేశారు. స్కూల్‌లో సిబ్బందిని ఆరా తియ్యడంతో పాటు, మధ్యాహ్నభోజనాన్ని ఏడీ నాగరాజు పరిశీలించారు.

నేడు ఆర్‌జేడీ శామ్యూల్ రాక

అనంతపురం విద్య, జూలై 24: పాఠశాల విద్యాశాఖ కడప ఆర్‌జేడీ శామ్యూల్ గురువారం జిల్లాకు రానున్నారు. జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు -1, 2లతో పాటు, కేజీబీవీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించను న్నారు. పంగల్ రోడ్డులోని ఆర్డీటీ ఆడిటోరియంలో మధ్యాహ్నం 2 గంటలపైన సమావేశం నిర్వహించనున్నారు. తొలిసారి ఆర్‌జేడీగా ఆయన జిల్లాకు రానున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల వేళ డీఈఓగా ఉన్న శామ్యూల్ వైసీపీ నాయకుల అక్రమాలపై అప్పట్లో గట్టిగానే ఉన్నారు. దీంతో ఆయనపై కక్షగట్టి అప్పటి వైసీపీ నాయకులు ఆయనను ఇక్కడి నుంచి పంపించేశారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి పార్టీలు అధికారంలోకి రావడంతో కర్నూలు జిల్లా డీఈఓగా ఉన్న శామ్యూల్‌ను కడప ఆర్‌జేడీగా నియమించింది. ఆర్‌జేడీ అయిన తర్వాత తొలిసారి అనంతపురం జిల్లాకు రానుండటం గమనార్హం.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోండి

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ



రాయదుర్గంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

రాయదుర్గం, జూలై 24: వర్షాభావంతో ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేరుశనగ సాగుచేయలేదని, ప్రత్యామ్నాయంగా ఆముదం, జొన్న, సజ్జ, రాగి, కొర్ర, పెసలు లాంటి పంటలు సాగు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొ న్నారు. పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారులు సిబ్బందితో బుధవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు? సీసీఆర్సీ కార్డ్స్ రెన్యువల్ గురించి, సీజన్‌లో రైతులకు ఇవ్వాల్సిన సూచనలు, పీఎం కిసాన్‌కు సంబంధించిన సమస్యలు, పొలంబడి తదితర విషయాలపై సిబ్బందితో వివరాలు సేకరించారు. జిల్లాలో వేరుశనగతో పాటు అన్ని పంటలు కలిపి దాదాపుగా 3,46,733 హెక్టార్లలో పంటలు సాగు చేయవలసి ఉండగా 83,839 హెక్టార్లలో మాత్రమే రైతులు పంటలు సాగు చేశారన్నారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మానాయక్, ఆయా మండలాల ఏఓలు నిర్మల్‌కుమార్, కృష్ణ, కిషోర్‌రెడ్డి, సాయికుమార్, ఏఈఓ ఆంజనేయులు, ఆర్‌బీకే సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపుకార్డుల పంపిణీకి చర్యలు

కణేకల్లు: జిల్లాలోని కౌలురైతులకు గుర్తింపుకార్డుల పంపిణీకి చర్యలు తీసుకుంటు న్నట్లు వ్యవసాయశాఖ జేడీఏ ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కణేకల్లు, బొమ్మనహాళ్ ఎంపీఈఓలతో ఆమె సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ మట్టినమూనా పరీక్షలను సత్వరమే పూర్తి చేయాలని ప్రతి ఆర్‌బీకే కేంద్రం వద్ద హరిత అనంత కార్యక్రమం కింద నాలుగు మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం స్థానిక వ్యవసాయ విత్తనోత్పత్తి క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ ఖరీఫ్‌సీజన్‌కు విత్తనోత్పత్తి క్షేత్రంలోని హెచ్ఎన్ఎం ఫారంలో బీపీటీ 5204 రకానికి చెందిన వరి నారును సిద్ధం చేస్తున్నామని 65 ఎకరాలలో సాగు చేస్తామన్నారు. మరో ఏడు ఎకరాల్లో బీపీటీ 2846 రకాన్ని సాగు చేయబోతున్నట్లు అధికారులు తెలిపారు. పీడీడీ ఫారంలో 67.5 ఎకరాలలో బీపీటీ 5204 రకంను సాగు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫారం ఏడీఏ నారాయణనాయక్, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, బొమ్మనహాళ్ ఏఓ సాయికుమార్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డివిజన్‌కు అభివృద్ధి నిధులు వస్తాయి

● డీఆర్ఎం విజయకుమార్



జీఎం సందేశ కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్ఎం, ఏడీఆర్ఎం

గుంతకల్లు, జూలై 24: ప్రతి సంవత్సరంలాగే ఈ బడ్జెట్‌లోనూ గుంతకల్లు రైల్వే డివిజన్‌కు పెద్ద మొత్తంలో నిధులు వస్తాయని డీఆర్ఎం విజయకుమార్ ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. బుధవారం మధ్యాహ్నం ప్రసారమైన జీఎం సందేశ కార్యక్రమానికి డీఆర్ఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటికి 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధులు వచ్చాయన్నారు. అభివృద్ధి కార్యక్రమం నడుస్తోందని, ఈదఫా కూడా డివిజన్‌లోని రైల్వే స్టేషన్లు, ప్రాజెక్టులు, బైపాస్ లైన్లకు తప్పక నిధులు మంజూరౌతాయని తెలియజేశారు. త్వరలో పింక్ బుక్ విడుదల అవుతుందని, డివిజన్‌కు ఎన్ని నిధులు వచ్చాయో బహిర్గతమౌతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రెండు రైళ్ల రద్దు

హైదరాబాద్ రైల్వే డివిజన్‌లో జరుగుతున్న లైన్ పనుల కారణంగా గుంతకల్లుకు చెందిన రెండు రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు-బోధన్ రైలు (నెం. 07671), కాచిగూడ-గుంతకల్లు రైలు (నెం. 07670)ను ఆగస్టు నెల పూర్తిగా రద్దుచేసినట్లు తెలియజేశారు.

యాద్గిర్‌లో వందేభారత్ రైలుకు స్టాపింగ్

అనంతపురం-గుంతకల్లు మీదుగా వెళ్లే ఓ రైలుకు యాద్గిర్ రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలియజేశారు. బెంగళూరు-కలబురగి (నెం. 22232) వందేభారత్ రైలుకు ఈ నెల 27 నుంచి, దాని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 22231)కు ఈ నెల 28 నుంచి ఒక నిమిషం సేపు యాద్గిర్‌లో నిలపనున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ 'తల్లికి వందనం' భేష్

● ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం విద్య, జూలై 24: అర్హులందరికీ తల్లివందనం కింద లబ్ధి చేకూరుస్తామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పష్టీకరించడం అభినందనీయమని అనంతపురం జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ (ఏడీపీఎస్ఏ) నాయకులు పేర్కొన్నారు. కమలానగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ శాసన మండలిలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ తల్లికి వందనం ఎంతమంది అర్హులుంటే అంత మందికీ ఇస్తామని చెప్పడం ఆనందంగా ఉందన్నారు. పైగా ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులకు వర్తింపజేస్తామని మంత్రి పేర్కొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా వ్యవస్థాపకులు, సీఆర్వో రవిచంద్రారెడ్డి, గౌరవ సలహాదారులు రామాంజినేయులు, జిల్లా గౌరవ అధ్యక్షులు గంగాధర్ యాదవ్, జిల్లా గోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి రమణారెడ్డి, కోశాధికారి రామచంద్ర, ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, నగర గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, నగర అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, నగర కోశాధికారి వేణు మనోహర్, ఇతర నాయకులు జానకిరాములు, విజయ్‌కుమార్, రఫీ, సోమశేఖర్, వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రీవత్స, మద్దయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జూలై 24: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంటెక్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, ఈసీ చంద్ర మోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. మే, జూన్‌లో నాలుగో సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సెమిస్టర్ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరీక్షల ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని వారు సూచించారు.

టీచర్ల పీఎఫ్ ఖాతాలు అప్‌డేట్ చేయాలి

● జడ్పీ సీఈఓకు ఏపీటీఎఫ్ వినతి



జడ్పీ సీఈఓకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూలై 24: ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాలను వెంటనే అప్‌డేట్ చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రావును బుధవారం ఆ సంఘం నాయకులు జడ్పీలో కలిశారు. సంఘం రాష్ట్రకార్యదర్శి నరసింహులు, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ పీఎఫ్ ఖాతాలు నేటికీ నవీనీకరించలేదన్నారు. ఎవరి ఖాతాలో ఎంత నగదు జమ అయ్యిందో...? నెలవారీగా జమలు, వడ్డీ జమల వివరాలు తెలియకుండా ఉండటం వల్ల పీఎఫ్ ఖాతాలపై ఉపాధ్యాయుల్లో ఆందోళన ఉందన్నారు. వేలాది మంది టీచర్ల పార్ట్ ఫైనల్ రుణాలు, ఇతర రుణాల కోసం నెలల తరబడి జడ్పీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా...సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అన్ని జిల్లాల్లో వార్షిక ఖాతాలు నిల్వల వివరాలు విడుదల చేసినా...అనంతపురం జిల్లాలో నేటికీ విడుదల చేయకుండా ఖాతాలను స్తంభించజేశారంటూ అసహనం వ్యక్తం చేశారు. అనారోగ్యం, పిల్లల చదువులు, ఇతర సమస్యల పరిష్కారానికి పీఎఫ్ రుణాలు ఆసరాగా ఉంటాయని టీచర్లు భావిస్తున్నారన్నారు. పీఎఫ్ ఖాతాలను వెంటనే అప్‌డేట్ చేయాలన్నారు. ఈ మేరకు సీఈఓకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు సతీష్‌కుమార్, సభ్యులు సర్దార్‌వలి, పాతిరెడ్డి, కిష్టప్ప, రామాంజనేయులు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో సులభంగా ఆదాయ పన్ను చెల్లింపు

అవగాహన సదస్సులో ఐటీఓ విజయలక్ష్మి



కేక్‌ను కట్‌చేసి వేడుకలను ప్రారంభిస్తున్న ఐటీఓ విజయలక్ష్మి

అనంతపురం సెంట్రల్, జూలై 24: ఆన్‌లైన్‌లోనే ఆదాయ పన్నును సులభంగా చెల్లించవచ్చని ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్(ఐటీఓ) విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆదాయపన్ను 165వ వార్షికోత్సవాన్ని బుధవారం ఆ శాఖ కార్యాలయంలో ఐటీఓ విజయలక్ష్మి కేక్‌కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం పన్ను చెల్లింపు దారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో విజయలక్ష్మి మాట్లాడుతూ అసెస్మెంట్ ఇయర్ 2024-25 రిటన్స్ ఫైల్‌ను ఈ నెల 31లోపు ప్రభుత్వ వేతన ఉద్యోగులు సబ్‌మిట్ చేయాలని సూచించారు. సెక్షన్ 80సీ కింద ఆధారాలు సమర్పించగలిగే ఎలిజిబిలిటి డిడక్షన్‌ను మాత్రమే క్లైమ్ చేయాలన్నారు. తప్పుడు రిటన్స్ ఫైల్ చేయకుండా కరెక్ట్ అండ్ ట్రూ ఇన్‌కమ్ ట్యాక్స్ రిటన్స్ ఫైల్ చేయాలని కోరారు. రాంగ్ డిడక్షన్ చేసేవారికి సెక్షన్ 270ఏ కింద జరిమానా విధిస్తారన్నారు. అంతకుముందు కార్యాలయ ఆవరణంలో శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదాయ పన్నుశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటరుణాల రెన్యువల్‌కు

30 వరకు గడువు

ఓబుళదేవరచెరువు, జూలై 24: పంట రుణాలను ఈనెల 30లోపు వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని ఓడీసీ సహకార సంఘం సీఈఓ రామమోహన్ బుధవారం రైతులకు సూచించారు. పంటరుణాలు, సీసీఎల్ రుణాలు, ఎల్‌టీ కంతులు సకాలంలో చెల్లించాలని కోరారు. సహకార సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతులు సభ్యత్వముండి, ఓటు హక్కు ఉన్న సభ్యులు, ఆధార్ (అప్‌డేట్), రేషన్‌కార్డు నామినీతో సహా, పాన్‌కార్డు, ఓటరు కార్డు జిరాక్స్ కాపీలతో పాటు మూడు ఫొటోలు సొసైటీలో అందించాలన్నారు.

రైలు ఢీకొని గొర్రెల మృతి

ధర్మవరం, జూలై 24: స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపంలో రైలు ఢీకొని 37 గొర్రెలు, మేకలు బుధవారం మృత్యువాతపడ్డాయి. లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన నారాయణప్ప గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి 67 గొర్రెలు, మేకలు ఉన్నాయి. బుధవారం వాటిని మేత కోసం తోలుకుంటూ ఇందిరమ్మ కాలనీ వైపు వెళ్లాడు. గొర్రెలు, మేకలు రైలు పట్టాలు దాటుతుండగా... రైలు వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 37 గొర్రెలు, మేకలు చనిపోయాయి. సుమారు రూ.5 లక్షలకు పైగా నష్టపోయాయననీ, తనను ప్రభుత్వమే ఆదుకోవాలని నారాయణప్ప వేడుకొంటున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించింది. కలెక్టర్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి తగిన పరిహారం ఇప్పిస్తానని మంత్రి భరోసా ఇచ్చారు.

తహసీల్దార్ కార్యాలయాల తనిఖీ


అమడగూరులో తహసీల్దార్‌తో మాట్లాడుతున్న జేసీ

కదిరిఅర్బన్, జూలై 24: అన్నమయ్య జిల్లా మదనపల్లి సంఘటనతో సత్యసాయి జిల్లా రెవెన్యూ శాఖ అప్రమత్తమైంది. ఇందులో భాగంగా కదిరి సబ్‌డివిజన్‌లోని పలు తహసీల్దార్ కార్యాలయాలను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. అందులో భాగంగా కదిరి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు గదులను జేసీ పరిశీలించారు. రికార్డులను జాగ్రత్తగా భద్రపర చాలని, విధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నల్లచెరువు: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. రికార్డుల నిర్వాహణ, భద్రతపై తహసీల్దార్ రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఆర్డీఓ వంశీకృష్ణ, ఆర్ఐ అశోక్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు మల్లికార్జునరావు, హరిత, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

తనకల్లు : స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. పలు వివరాలను తహసీల్దార్ శోభా సువర్ణమ్మను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సమస్య లు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

కదిరి, (అమడగూరు): అమడగూరు తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తనిఖీ చేశారు. మండల అధికారులతో సమవేశం నిర్వహించి, రెవెన్యూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డు గదిని భద్రంగా కాపాడుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రామనాథ్‌రెడ్డి, ఆర్ఐ ఈశ్వరయ్య, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

గాండ్లపెంట : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను జేసీ తనిఖీ చేశారు. రికార్డులు భద్రంగా ఉంచాలని తహసీల్దార్ శ్రావణికి సూచించారు. అనంతరం పోరెడ్డివారిపల్లి వద్ద స్టాక్ పాయింట్‌ను పరిశీలించి.. బియ్యాన్ని స్టోర్లకు త్వరగా తరలించాలని సూచించారు. ఆయన వెంట స్టాక్‌పాయింట్ బాబురావు, సీఎస్‌డీటీ సురేంద్ర, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

కదిరి : తలుపుల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఓబుళదేవరచెరువు: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ తనిఖీ చేశారు. సిబ్బందితో సమస్యలపై సమీక్షించారు. అనంతరం రికార్డులు, కంప్యూటర్, తహసీల్దార్ గదులను పరిశీలించారు. అనంతరం మండల సమస్యలపై తహసీల్దార్ ఖజాబీతో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ జాకీర్ హుస్సేన్, సీఎస్‌డీటీ రమాదేవి, సిబ్బంది ఉన్నారు.

నంబులపూలకుంట: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ తనిఖీ చేశారు. కంప్యూటర్, రికార్డుల గదిని పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను భద్రపరచాలని, వాటి బాధ్యత తహసీల్దార్‌దే అని పేర్కొన్నారు.

నల్లమాడ : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను, గదులను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ బుధవారం పరిశీలించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ నాగభూషణం, డిప్యూటీ తహసీల్దార్ దేవేంద్ర నాయక్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.


ఎన్‌సీసీ ఆర్మీకి ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

ఎన్‌సీసీ ఆర్మీ విభాగానికి ఎంపిక

కొత్తచెరువు, జూలై 24 : పరిగి మండలంలోని కొడిగినహళ్ళి గురుకుల పాఠశాలకు చెందిన 51 మంది విద్యార్థులు ఎన్‌సీసీ ఆర్మీ విభాగానికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ మురళీధర్‌బాబు బుధవారం తెలిపారు. బెటాలియన్-6 ఏ చెందిన ఆర్మీ సెలక్షన్ అధికారులు ఈ విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. ఆ విద్యార్థులను ఎన్‌సీసీ ఆర్మీ అధికారి అరుణ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కానరాని సచివాలయ సిబ్బంది



ఓబుళదేవరచెరువు, జూలై 24: మండలంలోని వెంకటాపురం గ్రామ సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం సిబ్బంది లేకపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. మధ్యాహ్నం 12.15 గంటలకు కార్యదర్శి నౌషాద్, సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు తనిఖీకి వెళ్లారు. కేవలం ఏఎన్ఎం, సర్వేయర్ మినహా ఎవరూ సిబ్బంది లేకపోవడాన్ని గుర్తించారు. విధులకు డుమ్మకొట్టిన సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్, ఎంపీటీసీ తెలిపారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయిస్తాం : పరిటాల


శ్మశానవాటికను పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరంరూరల్, జూలై 24 : మంత్రి సత్యకుమార్‌తో మాట్లాడి శ్మశానవాటికకు స్థలం కేటాయించేలా కృషి చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. బుధవారం పట్టణంలోని హిందూ శ్మశానవాటికను టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడారు. వైసీపీ హయంలో శ్మశానవాటికల నిర్వహణ గాడి తప్పిందని మండిపడ్డారు. శ్మశానవాటికలోకి వర్షపు నీరు రాకుండా లింక్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వహయంలో గుత్తేదారుడుకు ఇచ్చిన బర్నింగ్ మిషన్ పనులను అర్ధాంతంగా నిలిపివేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో బతికున్న మనుషులకే ఎలాగో విలువ ఇవ్వలేదని, ఇక చనిపోతే కనీసం వారిని పూడ్చేందుకు కూడా సరైన వసతులు లేకుండా చేశారని ధ్వజమెత్తారు. త్వరలో శ్మశానవాటికలో సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేస్తామన్నారు. ఆయన వెంట ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ఎల్.నరేంద్ర చౌదరి, పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్, నాయకులు ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, భీమినేనిప్రసాద్‌నాయుడు, అంబటిసనత్, సనత్, కరెంట్ ఆది, కేశగాళ్ల శీన ఉన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

కొత్తచెరువు, జూలై 24: కొత్తచెరువులో రోడ్లపై అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సురేంద్రరెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక బీసీ కాలనీలో ఆయన తన సిబ్బందితో పర్యటించారు. ప్రధాన రహదారి 33 అడుగుల రోడ్డు ఉండగా కేవలం 20 అడుగుల రోడ్డు మాత్రమే ఉందని.. ఈ రోడ్డుపై అక్రమ నిర్మాణాలు చేపట్టడం వల్ల రోడ్లు కుంచించుకుపోయానని అన్నారు. నిర్మాణాలు చేపట్టిన వాళ్లకు నోటీసులు అందించి నిర్మాణాలు తొలగిస్తామన్నారు. రోడ్లపైకే మురుగు నీటిని వదులుతున్న ఇంటి యజమానులను ప్రశ్నించారు. ఆయన వెంట టీడీపీ టౌన్ కన్వీనర్ ఒలిపి శీన, సచివాలయ కార్యదర్శి అజయ్‌కుమార్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

గాండ్లపెంట, జూలై 24: స్థానిక ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. జిల్లా కార్యదర్శి ఆదిబయన్న మాట్లాడుతూ.. పాఠశాలలో సబెక్టువారీగా ఉపాధ్యాయులతు లేకపోవడంతో నాణ్యమైన బోధన విద్యార్థులకు అందలేదని, వెంటనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మహబూబ్‌బాషా, రమణారెడ్డి, రమేష్, అప్పిరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి సరుకుల అందజేత

కదిరి, (అమడగూరు), జూలై 24: మండలంలోని గాజుపల్లిలో ఉన్న వృద్ధాశ్రమానికి తనకల్లు మండలంలోని కొక్కంటి క్రాస్ వందేమాతరం టీమ్ సభ్యులు బుధవారం నిత్యవసర సరుకులు అందించారు. నెలకు సరిపడా బియ్యం, నిత్యవసర వస్తువులు అందించినట్లు ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి తెలిపారు. ఆశ్ర మ నిర్వాహకులు వందేమాతరం టీమ్ సభ్యులకు కృతజ్ఞలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటరమణ, అశోక్, నవీన్, సుబ్బయ్య, బాలు పాల్గొన్నారు.

అయ్యంకి వెంకటరమణయ్యకు నివాళి

ధర్మవరం, జూలై 24: గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి సందర్భంగా ధర్మవరం శాఖ గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి బుధవారం పలువురు నివాళులర్పించారు. ఆయన గ్రంథాలయాల అభివృద్ధి చేసిన కృషిని గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది శివమ్మ, రమణనాయక్, గంగాధర్, పాఠకులు పాల్గొన్నారు.

27 నుంచి షూటింగ్ బాల్ సెలెక్షన్స్

ధర్మవరం, జూలై 24: సత్యసాయి జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక పోటీలను శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోషియేషన్ ఇన్‌చార్జి జింకా ఉదయ్‌కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 16 ఏళ్లలోపు వయస్సు ఉన్న బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు 94400 41552 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపు వేలం

నల్లచెరువు, జూలై 24: మండలంలోని పంతులచెరువు చేపల పెంపక వేలంపాటను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ స్వర్ణలత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పంతులచెరువు, ఇందుకూరిపల్లి కుంటలో సంవత్సరాల కాలంపాటు చేపలు పట్టుకునే హక్కులను పొందేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈవేలం నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేలం స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.రెండు వేలు ధరావత్తు చెల్లించి పాట పాడాలని కార్యదర్శి విజయ్ తెలిపారు.

క్రిష్ణాపురంలో ఘనంగా ఉరుసు

బుక్కపట్నం, జూలై 24: మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో మొహరం వేడుకల్లో భాగంగా బుధవారం ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పెద్ద రసూల్‌స్వామి, చిన్నరసూల్‌స్వామి పీర్లను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. గంధం మహోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పీర్లను జలధికి తరలించారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కదిరి అర్బన్, జూలై 24: పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కదిరి సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్‌నాయక్ సూచించారు. బుధవారం పట్టణంలో పోస్టల్ పథకాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పోస్టల్ శాఖ సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్, తపాల జీవిత బీమా, గ్రామీణ తపాల జీవితబీమా, టైమ్, ఫిక్సడ్ డిపాజిట్, మరిన్ని పొదుపు పథకాలు ఉన్నాయన్నారు. పోస్టాఫీసులో పేమెట్స్ బ్యాంక్ ఖాతా ద్వారా ఆన్‌లైన్‌లో సేవలం దుబాటులో ఉన్నాయన్నారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

విద్యార్థులకు ఆటల పోటీలు



ఎనుమలపల్లి పాఠశాలలో ఖో-ఖో ఆడుతున్న విద్యార్థులు, డైట్‌లో క్రీడాపోటీలు నిర్వహిస్తున్న సిబ్బంది

పుట్టపర్తి, జూలై 24: ఎనుమలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. శిక్షసప్తాహ్ కార్యక్రమంలో బాగంగా మూడో రోజు పాఠశాల ఆవరణంలో లగోరి, తొక్కుడుబిల్ల, వాలీబాల్, బాల్‌బాడ్మింటన్, కబడ్డీ, టెన్నీకాయట్ ఆటల పోటీలను నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణ పేర్కొన్నారు. మరోవారం పాటు శిక్షసప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీఈటీ రమేష్‌బాబు తెలిపారు.

బుక్కపట్నం: జాతీయ విద్యావిధానం ప్రారంభమై నాలుగు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరు రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో ఏడురోజులపాటు శిక్షాసప్తహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవిసాగర్ బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా డైట్ కళాశాలలో ఈనెల 28 వరకు వివిధ క్రీడ కార్యక్రమాలు చేపడతామన్నారు. బుధవారం డైట్‌లో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పీడీ రామక్రిష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎస్పీ హామీతో న్యాయవాదుల దీక్ష విరమణ


న్యాయవాదులతో మాట్లాడుతున్న ఏఎస్పీ

కదిరి లీగల్, జూలై 24: న్యాయవాది రామస్వామిపై దాడి చేసిన నిందితులపై చట్టం మేరకు చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ ఎన్ విష్ణు బుధవారం పేర్కొన్నారు. న్యాయవాదిపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని తొమ్మిది రోజులుగా న్యాయవాదులు రిలే నిరాహార దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్పీ న్యాయవాదుల దీక్షా శిబిరాన్ని సందర్శించారు. న్యాయవాదులతో సంఘటపై చర్చించారు. విషయాన్ని ఎస్పీ, ఉన్నతాధికారులకు వివరించారు. చట్టానికి లోబడి నిందితులపై చర్యలు తప్పకుండా తీసుకుంటామని ఆయన న్యాయవాదులకు హామీ ఇచ్చారు. అనంతరం నిరసనకారులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. నిందితుల అరెస్టుకు ఆదివారం వరకు గడువు ఇస్తామని, అంతలోపు అరెస్ట్ చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఏఎస్పీ వెంట డీఎస్పీ శ్రీలత, సీఐ పుల్లయ్య ఉన్నారు.

మహిళా పోలీసుల సమస్యలు పరిష్కరిస్తా: ఎస్పీ


ఎస్పీని అభినందిస్తున్న మహిళా పోలీసు సంఘం నాయకురాళ్లు

పుట్టపర్తి రూరల్, జూలై 24 : జిల్లాలోని మహిళా పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ఎస్పీ రత్న స్పష్టం చేశారు. బుధవారం స్థానిక పోలీసు కార్యాలయంలో మహిళా పోలీసుల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షురాలు ఎంవీ భవానీ, ధర్మవరం మహిళా పోలీసు కృష్ణవేణి ఎస్పీని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీకి వివరించారు. దీనిపై స్పందించిన ఎస్పీ త్వరలోనే మహిళా పోలీసులందరితో సమావేశం నిర్వహించి అందరి సమస్యలను తెలుసుకుంటానని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

ప్రశాంతతకు భంగం కల్గించొద్దు

మొహరం వేడుకల సందర్భంగా జిల్లా ప్రజలు ప్రశాంతవాతావరణంలో పండుగను జరుపుకోవాలని జిల్లా ఎస్పీ వీ రత్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబందించి ప్రజలు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని, వేడుకల్లో ఎలాంటి గొడవలు, ఘర్షణలకు వెళ్లకుండా అన్ని వర్గాల ప్రజలు సమన్వయంతో పండుగను జరుపుకోవాలన్నారు. అన్నిప్రాంతాల్లో ప్రశాంతవాతావరణం ఉండేలా చూడాల్సిన బాధ్యత పోలీసుశాఖపై ఉందన్నారు.


ఆధార్ కేంద్రంలో అంగన్‌వాడీ చిన్నారులు

ఆధార్ కేంద్రాలకు అంగన్‌వాడీ చిన్నారులు

తనకల్లు, జూలై 24: మండలంలోని కోటపల్లి, టి.సదుం గ్రామాల్లో బుధవారం ఆధార్ కేంద్రాలను అధికారులు నిర్వహించారు. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది పిల్లలను, తల్లులను తీసుకుని కేంద్రాలకు వచ్చారు. ఆధార్ కార్డు లేని చిన్నారులను కేంద్రాలకు తీసుకెళ్లి, ఆధార్ కార్డులు తీయించే పనిలో నిమగ్నమయ్యారు. పుట్టిన ప్రతిబిడ్డకు ఆధార్ తీయించుకోవాలన్నారు. సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ ఆధార్ కేంద్రాలకు పరిశీలించారు.

భజన బృందాలకు శిక్షణ

నల్లచెరువు: ప్రసిద్ధిగాంచిన పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయం వద్ద కదిరి సేవాభారతి ఆధ్వర్యంలో భజన బృందాలకు శిక్షణ ఇచ్చారు. బుధవారం మండలంలోని భజన బృందాల్లో ఇద్దరు చొప్పున ఈ శిక్షణలో పాల్గొన్నారు. సేవాభారతి అధ్యక్షుడు కేశవ, కదిరి తాలూకా అధ్యక్షుడు మట్టా చెన్నరాయశెట్టి, కార్యదర్శి గోపాల్‌కృష్ణ మాట్లాడుతూ... ఏటా ఈశిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భజన బృందం సభ్యులు, నల్లచెరువు మండల సేవాభారతి అధ్యక్షుడు సూర్యనారాయణ ఉన్నారు.


శిక్షణ ఇస్తున్న సేవాభారతి సభ్యులు



మద్దిలేరులో ఆక్రమణల తొలగింపు

కదిరి, జూలై 24: పట్టణంలోని మద్దిలేరు వాగును కబ్జా చేసి.. నిర్మించిన అక్రమ కట్టడాలను బుధవారం ఇరిగేషన్ అధికారులు తొలగించారు. గత కొన్ని రోజుల క్రితం ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వాగు ఆక్రమణపై కొలతలు వేశారు. ఇందులో భాగంగా బుధవారం మద్దిలేరులోని ఆక్రమణలను తొలగించారు.

రాష్ట్రానికి నిధుల కేటాయింపుపై హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కదిరి, (అమడగూరు), జూలై 24: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చొరవతో ప్రధాని నరేంద్రమోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించడంపై హిందూపురం పార్లమెంటు రైతు సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి నిర్లక్ష్యం వల్ల ఐదేళ్లుగా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. ఇప్పడు మొదటి సారిగా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ మాట మారుమోగిందన్నారు. నవ్యాంధ్రకు రెండు కళ్లలాంటి రాజధాని అమరావతికి, పోలవరానికి ఆర్థిక అభయం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి కాలేనాయక్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ రాజారెడ్డి, దొడ్డం మూర్తి, రమేష్, ఉత్తప్ప పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌తో ఏపీకి మంచి రోజులు


ప్రధాన మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న, నాయకులు

పుట్టపర్తి రూరల్, జూలై 24: రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్ర బాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ కృషితో ఏపీకి మంచి రోజులు వచ్చాయని, కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దపీట వేశారని కూటమి నాయకులు అన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినందుకు బుధవారం స్థానిక హనుమాన్‌కూడలిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బాణాసంచా పేల్చి.. మిఠాయిలు పంచారు. ఇందులో టీడీపీ నాయకులు సామకోటి ఆదినారాయణ, మునిసిపల్ మాజీ చైర్మన్ బెస్తచలపతి, గూడూరు ఓబులేసు, బోయశ్రీరాములు, కరణం చంద్రశేఖర్, రాష్ట్ర బీజేపీ కల్లుగీత కార్మికుల సంఘం కన్వీనర్ హరికృష్ణగౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండమరాజు, జల్లా ప్రధాన కార్యదర్శి కత్తిరాజారెడ్డి, మీడియా కన్వీనర్ జ్యోతిప్రసాద్, నాయకులు సునీల్‌వైట్ల, బాలగంగాధర్, సోకె రామాంజినేయులు, నారాయణ, కళ్యాణ్, నారాయణస్వామి, సతీష్ పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

నంబులపూలకుంట, జూలై 24: చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు ఎస్ఐ శ్రీధర్ సూచించారు. బుధవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ర్యాగింగ్, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, రోడ్డు భద్రత, ఆరోగ్య సంరక్షణ.. తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుబ్బిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శిరీషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

టెట్, డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

కదిరి అర్బన్, జూలై 24 : నియోజకవర్గంలోని టెట్, డీఎస్సీ అభ్యర్థులకు కందికుంట నారాయణమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత శిక్షణా కేంద్రాన్ని త్వరలో ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు నాగేశ్వర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని సబ్జెక్టులపై ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల 31లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు 9000034688 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పారిశుధ్యంపై గ్రామసభ

ఓబుళదేవరచెరువు, జూలై 24: మండలంలోని వెంకటాపురంలో సర్పంచ్ రెడ్డిపల్లి శంకర్‌రెడ్డి అధ్యక్షతన గ్రామ సభ బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్, కార్యదర్శి నౌషాద్ మాట్లాడుతూ.. ప్రజలు పరిసరాలను, పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రధానంగా వర్షాకాలంలో ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షం నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. దోమల వ్యాప్తిని అరికడితే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాసులు, నాయకులు రఘునాథ్‌రెడ్డి, నారప్పరెడ్డి, అంజనేయులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి సభ్యుల గైర్హాజరు

27కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన ఎంపీడీఓ

చిలమత్తూరు, జూలై 24: కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిసారిగా జరిగిన మండల సర్వసభ్య సమావేశం నాటకీయ పరిణామాల మధ్య వాయిదా పడింది. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం అధికారులు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం అవుతుందని అధికారులు ప్రకటన జారీ చేశారు. అయితే ఆ సమయానికి సభ్యులు ఎవ్వరూ రాకపోవడంతో గంట తరువాత ఎంపీడీఓ రామ్‌కుమార్ సభను ఈ నెల 27కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

సమావేశానికి హాజరుకాని ఎంపీపీ, ఎంపీటీసీలు

సర్వసభ్య సమావేశం జరుగుతున్న సమయానికి ఎంపీపీ పురుషోత్తంరెడ్డితోపాటు ఇతర ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు హాజరుకాలేదు. ప్రధానంగా వైసీపీలో నెల కొన్న వర్గపోరుతో ఎంపీటీసీలు రెండు వర్గాలుగా చీలిపోయారు. కొందరు ఎంపీపీ పురుషోత్తంరెడ్డికి మద్దతుగా ఉండగా, మరికొందరు ఆయనకు దూరంగా ఉంటున్నారు. దీనికి తోడు గత ఎన్నికల ముందు జడ్పీటీసీ అనూషతోపాటు పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. దీంతో సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు తగిన సంఖ్యాబలం లేదనేది స్పష్టమవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకునే సమావేశానికి ఎంపీపీ హాజరుకాలేదన్న చర్చ జరుగుతోంది.

సమాచారం ఇవ్వకుండా వాయిదా

సర్వసభ్య సమావేశం జరుగుతుందని వచ్చిన తమకు ఎలాంటా సమాచారం ఇవ్వకుండా సభను ఏకపక్షంగా ఎంపీడీఓ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారని వైస్ ఎంపీపీ బయప్ప, జడ్పీటీసీ అనూష, ఎంపీటీసీ లక్ష్మిదేవి, నాగమణి పేర్కొన్నారు. కనీసం సభను ప్రారంభించి ఉంటే కోరం ఉందా? లేదా? అనే విషయం తెలిసేదని, అలా కాకుండా సభను నిర్వహించకుండానే వాయిదా వేయడం ఏంటని ఎంపీడీఓని ప్రశ్నించారు.



ఆందోళనకు దిగిన టీడీపీ నాయకులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ అనూష

దౌర్జన్యాలు, దాడులకు సమాధానం చెప్పాలి

గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డంపెట్టుకొని తమపై చేసిన దౌర్జన్యాలు, దాడులకు ఎంపీపీ పురుషోత్తంరెడ్డి సమాధానం చెప్పిన తరువాతే సభకు హాజరుకావాలని జడ్పీటీసీ అనూషతో పాటు ఎంపీటీసీలు, సర్పంచులు ఆందోళన చేశారు. సమావేశం ప్రారంభానికి ముందుగానే వారు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకొని కార్యాలయం ముందు నిరసన తెలిపారు. జడ్పీటీసీగా ఉన్న తనకు కనీసం కార్యాలయంలో ప్రత్యేక సీటు ఇవ్వకుండా ఒక బీసీ మహిళనే అవమానించారని ఈ సందర్భంగా జడ్పీటీసీ ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు సమావేశం జరిగినా ఎంపీపీ చేసిన దౌర్జన్యాలకు, దాడులకు సమాధానం చెప్పాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు.

సభ్యులను గౌరవిస్తాం

మండల సభలో ఎంపీడీఓ ప్రతిస్పందన

గోరంట్ల, జూలై 24: సభ్యులను గౌరవిస్తాం.. మర్యాదిస్తాం.. అంతేకాని భయపడేది లేదని గోరంట్ల మండల సమావేశంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ బుధవారం పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన జరిగింది. జడ్పీటీసీ పాలే జయరామనాయక్ మాట్లాడుతూ కలెక్టర్ మండలానికి వస్తే కనీసం తమకు సమాచారం అందించలేదని, మేం ప్రజాప్రతినిధులము కామా అంటూ అన్నారు. ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకుంటామని ఏఓ సూర్యనారాయణ సమాధామిచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఇకపై సభ్యులకు సమాచారం అందజేయడం జరుగుతుందన్నారు. గోరంట్లలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని చర్యలు చేపట్టాలని జడ్పీ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా కోరారు. మలసముద్రం పంచాయతీలో విద్యుత్ స్తంభాలు విరిగాయని రెండేళ్ల నుంచి చెబుతున్నా అధికారులు పట్టించుకోలేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. నీటి పథకం బోరు కోసం మూడు స్తంభాలకు అవసరమైన వైర్ వేయకపోవడంతో పంచాయతీ నిధులతోనే వేయాల్సి వచ్చిందన్నారు. షెడ్‌లో ఒక బల్బు ఉంటే రూ.4,400 విద్యుత్ బిల్లు వచ్చిందన్నారు. ఏ సమస్య ఉన్నా టోల్ ఫ్రీనెంబర్‌కు సమాచారం అందించాలని ట్రాన్స్‌కో జేఈ జయవర్ధన్‌రెడ్డి తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ సమావేశానికి ఎందుకు రాలేదని సభ్యులు నిలదీశారు. ఎన్ని పనులున్నా మండలస్థాయి అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీఓ ఆదేశించారు. సమావేశానికి పశుసంవర్ధక, మైనర్ ఇరిగేషన్, అటవీశాఖ అధికారులు హాజరుకాలేదు. సమావేశంలో తహసీల్దార్ అక్బల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు దీక్షలు ఆపం

హిందూపురం అర్బన్, జూలై 24: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు శాంతియుతంగా నిరసన దీక్షలు చేపడతామని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పేర్కొన్నారు. బుధవారం మునిసిపల్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన దీక్ష చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మూడు రోజులుగా సాగుతున్న దీక్షా కార్యక్రమంలో మునిసిపల్ యూనియన్ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో కార్మికులు మృతి చెందితే వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబంలో ఎవరికో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ పేరుతో తొలగించిన కార్మికులకు న్యాయం చేయాలని, బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్‌లలో లోటుపాట్లు సవరించి కార్మికులకు వర్తింపజేయాలన్నారు. డైలీబేస్ అడిషినల్ కార్మికులకు ఎస్ఎస్ఆర్ రేటుమీద రూ.540 జీతం ఇవ్వాలని, కార్మికులకు పనిముట్లతోపాటు రక్షణ పరికరాలు అందజేయాలన్నారు. మునిసిపల్ కార్మికులకు మూడునెలలకో మారు హెల్త్‌క్యాంప్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు దశలవారిగా నిరసన తెలుపుతామని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

దాడులను అరికట్టాలి: ఏఐడీఎస్ఓ



ర్యాలీగా వస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులు

హిందూపురం అర్బన్, జూలై 24: మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఏఐడీఎస్ఓ, ఏఐఎంఎస్ఎస్ఓస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ పరిధిలోని చిన్నమార్కెట్ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్, ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు హేమావతి, పాఠశాల ఉపాధ్యాయులు సరోజాదేవి, సభ్యులు పూజిత, కీర్తి, రజిని తదితరులు ఉన్నారు.

పంచాయతీ అధ్యక్షురాలిగా ఏకగ్రీవ ఎన్నిక



గిరిజమ్మను అభినందిస్తున్న జేడీఎస్ నాయకులు

పావగడ, జూలై 24: న్యాయదగుంటె గ్రామ పంచాయతీ నూతన అధ్యక్షురాలిగా జేడీఎస్ పార్టీ మద్దతురాలు బోయ గిరిజమ్మ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి తహసీల్దార్ వరదరాజులు తెలిపారు. జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు ఈరన్న, పంచాయతీ ఉపాధ్యక్షుడు పరమేశ్, పాలేగాడ్ లోకేష్, బీరలింగప్ప, చిదానందరెడ్డి, మహ్మద్ అన్సార్, మంజునాథ్, దుర్గప్ప తదితరులు అభినందనలు తెలిపారు.

చదువుతోనే దేశాభివృద్ధి

హిందూపురం అర్బన్, జూలై 24: చదువుతోనే దేశాభివృద్ధి సాధ్యమని చేయూతా ట్రస్ట్ అధ్యక్షుడు రమేష్ పేర్కొన్నారు. బుధవారం తిలక్‌నగర్‌లోని ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిల్‌లను వితరణ చేశారు. పాఠశాల దశ నుంచే చదువుపై మక్కువ పెంచాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు విశ్వేశ్వరయ్య, హెచ్‌ఎం. నాగవేణి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

హెంజేరు సిద్దేశ్వరస్వామి హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

మడకశిర(అమరాపురం), జూలై 24: అమరాపురం మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఈఓ నరసింహరాజు, గ్రామపెద్దల సమక్షంలో మూడు నెలల హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మూడు నెలలకు సంబంధించి రూ.2,81,510 వచ్చింది. బంగారు 11.400 గ్రాములని బంగారుపరిశీలకులు పాండురంగారెడ్డి తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమారస్వామి, ఆలయ మాజీ చైర్మన్ మంజునాథ, కరియన్నగౌడ్, తిప్పజ్జ, ఓబుళరాజు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

మడకశిర రూరల్, జూలై 24: రాష్ట్రస్థాయి అవార్డు వ్యాసమహర్షిని అందుకున్న బుళ్లసముద్రం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్‌ను బుధవారం యూటీఎఫ్ నాయకులు సన్మానించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు బూతప్ప మాట్లాడుతూ విశ్వనాథ్ విద్యార్థులను తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మాలింగప్ప, ప్రధాన కార్యదర్శి జోగప్ప యూనియన్ నాయకులు కదిరప్ప, శివప్రసాద్ పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

హిందూపురం(సోమందేపల్లి), జూలై 24: సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమానికి వివిధశాఖల అధికారులు, నాయకులు, మండలపరిషత్ పాలకవర్గం సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు కాగడాల ర్యాలీ

హిందూపురం అర్బన్, జూలై 24: కార్గిల్ దివస్ సందర్భంగా గురువారం కాగడాల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి బుధవారం తెలిపారు. ర్యాలీ సాయంత్రం 5.30 గంటలకు పొట్టి శ్రీరాములు సర్కిల్ నుంచి ఉంటుందన్నారు.

మహిళా పోలీసుల సమస్యలు పరిష్కరిస్తా

: ఎస్పీ రత్న



ఎస్పీని అభినందిస్తున్న మహిళా పోలీసు సంఘం నాయకురాళ్లు

పుట్టపర్తి రూరల్, జూలై 24: జిల్లాలోని మహిళా పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ఎస్పీ రత్న స్పష్టం చేశారు. బుధవారం స్థానిక పోలీసు కార్యాలయంలో మహిళా పోలీసుల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షురాలు ఎంవీ భవానీ, ధర్మవరం మహిళా పోలీసు కృష్ణవేణి ఎస్పీని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీకి వివరించారు. దీనిపై స్పందించిన ఎస్పీ త్వరలోనే మహిళా పోలీసులందరితో సమావేశం నిర్వహించి అందరి సమస్యలను తెలుసుకుంటానని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

ఆధార్ శిబిరాలు ఎక్కడ..?

అగళిలో కానరాని కేంద్రాలు

అగళి, జూలై 24: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం కోసం ప్రతి గ్రామ సచివాలయంలోనూ ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆధార్‌కార్డు తీసుకుని పదేళ్లు గడిచినా ప్రతి ఒక్కరికి అప్డేట్ చేయడంతోపాటు ఇంటి అడ్రస్సు, వయసు, పేరుమార్పు, కొత్త ఆధార్ నమోదు వంటి సేవలను ఉపయోగించుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయంలో ఈ సేవలు అందబాటులో ఉంటాయని తెలియజేశారు. అగళి మండలంలో ఎక్కడా ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి వెంటనే ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

27 నుంచి

షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక

ధర్మవరం, జూలై 24: సత్యసాయి జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక పోటీలను శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోషియేషన్ ఇన్‌చార్జి జింకా ఉదయ్‌కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 16 ఏళ్లలోపు వయస్సు ఉన్న బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు 94400 41552 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రైలు ఢీకొని 37 గొర్రెలు మృతి

ధర్మవరం, జూలై 24: పట్టణంలో ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఓ రైలు ఢీకొని 37 గొర్రెలు, మేకలు బుధవారం మృత్యువాతపడ్డాయి. లక్ష్మీచెన్నకేశవపు రానికి చెందిన కాపరి నారాయణప్ప జీవాలు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. అతనికి 67 గొర్రెలు, మేకలు ఉన్నాయి. బుధవారం వాటిని మేత కోసం ఇందిరమ్మ కాలనీ తీసుకొని రైలు పట్టాలు దాటుతుండగా... రైలు వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 37 గొర్రెలు, మేకలు చనిపోయాయి. రూ.5 లక్షలకుపైగా నష్టపోయాయనని, తనను ప్రభుత్వమే ఆదుకోవాలని నారాయణప్ప కోరాడు.

ముగిసిన న్యాక్ బృందం పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న న్యాక్ టీమ్ చైర్మన్ రాజేంద్రసింగ్

పెనుకొండ, జూలై 24: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న న్యాక్ టీమ్ పర్యటన బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాక్ బృంద సభ్యులు మాట్లాడుతూ విద్యా ప్రమాణాలను అంచనావేసి గ్రేడింగ్ నిర్వహించి అధ్యాపకులకు పలు సూచనలు చేయడం జరిగిందన్నారు. మారుమూల గ్రామాల నుంచి కళాశాలకు వచ్చే పేద విద్యార్థులకు అత్యంత ప్రమాణాలతో బోధన అందిస్తూ వారి ఉన్నత స్థితికి పాటుపడుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశానికి ప్రిన్సిపాల్ కేశవరావు అధ్యక్షత వహించగా న్యాక్ టీమ్ చైర్మన్ ప్రొఫెసర్ రాజేంద్రసింగ్ సంగ్వాన్, కోఆర్డినేటర్ బ్రిజాబల్లాపాల్, డాక్టర్ కేపాల్ పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘననివాళి



నివాళులు అర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు

పెనుకొండ, జూలై 24: గుర్రం జాషువా వర్ధంతిని బుధవారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యసాయిజిల్లా ఎస్సీఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు ఎంఎన్ మూర్తి అధ్యక్షత వహించగా కళాశాల చరిత్ర అధ్యాపకుడు మూర్తి, ఎన్ఎస్ఎస్ పీఓలు హఫీజ్, శంకర్‌నాయక్, శ్రీలేఖ పాల్గొని జాషువా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జాషువా చరిత్ర గురించి ఆయన రచనల గురించి తెలుగు సాహిత్యానికి జాషువా చేసిన సేవల గురించి వివరించారు.

సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

పెనుకొండ, జూలై 24: సీఐటీయూ మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు పెడబల్లి బాబా కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కన్వీనర్‌గా రమేష్, కోకన్వీనర్‌గా బాబావలి, కోశాధికారిగా బావమ్మతోపాటు అంగనవాడీ యూనియన్ నాయకురాలు సావిత్రమ్మ, లక్ష్మీదేవి, ఆషా వర్కర్స్ యనియన్ రాజేశ్వరి, తోపుడుబండ్ల సంఘం అధ్యక్షుడు మాహబూబ్‌బాష, రాజారావు, శెక్షావలి, అరీఫ్, ఆటో యూనియన్ అధ్యక్షులు షరీఫ్, తిప్పన్న, సివిల్‌సప్లే హమాలీ యూనియన్ అధ్యక్షుడు నాగరాజుతోపాటు 15మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

చిలమత్తూరు: సీఐటీయూ మండల కమిటీ ఎంపిక ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జేపి శ్రీనివాసుల ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. మండల కన్వీనర్‌గా రామచంద్ర, కో కన్వీనర్‌గా వెంకటేష్, శోభారాణి, పద్మావతి, లక్ష్మీ నారాయణ, రామతులసి, ఈశ్వరమ్మ, పుణ్యవతి, లక్ష్మీనరసమ్మ, ఆశాలు శోభ, రెడ్డమ్మ, చౌడేశ్వరి, గౌసు, చలపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, సుధాకర్, నాగరాజు, శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

కొడిగెనహళ్ళి విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

కొత్తచెరువు, జూలై 24: పరిగి మండలంలోని కొడిగెనహళ్ళి గురుకుల పాఠశాలకు చెందిన 51 మంది విద్యార్థులు ఎన్‌సీసీ ఆర్మీ విభాగానికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ మురళీధర్‌బాబు బుధవారం తెలిపారు. బెటాలియన్-6 ఏ చెందిన ఆర్మీ సెలక్షన్ అధికారులు ఈ విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. ఆ విద్యార్థులను ఎన్‌సీసీ ఆర్మీ అధికారి అరుణ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

యూటీఎఫ్ మండల అడ్‌హక్ కమిటీ ఎన్నిక

రొళ్ల, జూలై 24: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సత్యసాయి జిల్లా యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు బూతప్ప ఆధ్వర్యంలో మండల అడ్‌హక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల యూటీఎఫ్ గౌరవాధ్యక్షులుగా హెచ్.నారాయణస్వామి, అధ్యక్షులుగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా అనీల్‌కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలుగా వసంతలక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా కేశవ్‌ప్రసాద్, కోశాధికారిగా పోతులయ్య, కార్యదర్శులుగా హిదాయతుల్లా, అనిల్‌కుమార్, చిన్నికృష్ణ, శ్యాంప్రసాద్, నరేంద్ర, ఉగ్రనరసింహ, పార్థసారథి, అర్జున్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఎన్నికల పరిశీలకులుగా మాలింగప్ప, జోగప్ప వ్యవహరించారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

పెనుకొండ, జూలై 24: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో నివాసముంటున్న టీడీపీ కార్యకర్త మంజునాథ్(43) బ్రెయిన్ స్ట్రోక్‌తో బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములుయాదవ్, యాదవ సాధికార కమిటీ నాయకుడు అశ్వర్థనారాయణ, సుబ్రహ్మణ్యం, బోయ అంజనేయులు, నవీన్ నివాళులు అర్పించారు.



నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

వాసవీమాతకు గోరింటాకుతో అలంకరణ

పెనుకొండ, జూలై 24: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారిని గోరింటాకుతో ప్రత్యేకంగా అలంకరించారు. బుధవారం ఉదయం అర్చకులు శేషగిరి స్వామి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలుచేసి గోరింటాకుతో అలంకరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుధాకర్‌గుప్త, సూర్యనారాయణ, రాధాస్వామి, వెంకటేశులు పాల్గొన్నారు.

రాగి సాగుతో అధిక లాభాలు: ఏఓ

మడకశిర రూరల్, జూలై 24: రాగి పంట సాగుతో రైతులకు అధిక లాభాలు సాధ్యమని మండల వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప సూచించారు. మండలంలోని తురుకువాండ్లపల్లి, జమ్మానిపల్లి గ్రామాల రైతులతో బుధవారం రాగి సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన నిర్వహించారు. రాగి పంట సాగుచేసిన తరువాత తెగుళ్లు రాకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఓ అవగాహన కల్పించారు. అనంతరం వేరుశనగ పంటలను పరిశీలించారు. వేరుశనగను ఆగస్టు మొదటి వారం వరకు వేసుకోవచ్చన్నారు.

సద్వినియోగం చేసుకోండి

మడకశిరటౌన్, జూలై 24: పట్టణంలోని షిరిడీసాయినాథుడి ఆలయ ఆవరణలో శుక్రవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. నేత్ర సమస్యలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు గాయాలు

గోరంట్ల, జూలై 24: పట్టణంలోని కదిరి రోడ్డులో పెట్రోల్‌బంక్ వద్ద బుధవారం ద్విచక్రవాహనం బోల్తా పడగా కళాశాల విద్యార్థులు నరేంద్ర, కార్తిక్ తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని రాజీవ్‌కాలనీకి చెందిన వారు కళాశాలకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పెట్రోల్ బంక్ వద్ద కుక్కఅడ్డురావడంతో బోల్తాపడ్డారు. ప్రమాదంలో నరేంద్ర తలకు బలమైన గాయం కాగా కార్తీక్‌కు తీవ్రగాయాలైయ్యాయి. గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ ఉషా వైద్యచికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం 108లో పుట్టపర్తికి తరలించారు.

దోమల నివారణకు ఫాగింగ్

మడకశిరటౌన్, జూలై 24: నగర పంచాయతీ అధికారులు పట్టణంలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేపట్టారు. బుధవారం పట్టణంలోని ఆరేపేట, గాంధీబజార్, న్యూ ఎస్సీ కాలనీ తదితర చోట్ల ఫాగింగ్ చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఇటీవల నగర పంచాయతీ అధికారులతో సమావేశమై పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని సూచనలు చేయడంతో అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు.

పరామర్శ

గోరంట్ల, జూలై 24: పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీకి చెందిన బీజేపీ నాయకుడు కొర్రు అంజనేయులు ఇటీవల గాయపడగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శేఖర్ బుధవారం ఆయనను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనతోపాటు ఈశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మేదర శ్రీనివాసులు తదితరులున్నారు.

శిక్షాసప్తాహ్ క్రీడాపోటీలు



చదరంగం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గోరంట్ల, జూలై 24: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈనెల 22 నుంచి 29వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాల్లో శిక్షా సప్తహ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చదరంగా, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, షటిల్, టెన్నికాయింట్ తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయలు గోపాల్, పీడీ రామమోహన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందూపురం(పరిగి), జూలై 24: శిక్ష సప్తాహ్‌లో భాగంగా బుధవారం పరిగి ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీ, ఎంఈఓ-2 శేషాచలం, ప్రధానోపాధ్యాయుడు కృపాసత్యరాజ్, పీఈటీ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి వితరణ

హిందూపురం అర్బన్, జూలై 24

పట్టణ పరిధిలోని గాంధీ సర్కిల్‌లో నూతనంగా నిర్మించనున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం మార్కెట్ హోల్‌సేల్ వ్యాపారి సూర్యనారాయణ కుమారుడు భరత్. రూ.2,22,222 వితరణ చేశాడు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్ర, కార్యదర్శి నిమ్మకాయల రాము, ఉపాధ్యక్షుడు రఘునాథ్ తదితరులకు ఆ మొత్తాన్ని అందజేశాడు.